సంపుటి :02 సంచిక :296 పేజీలు :05
వెల ₹5
అక్షర దర్బార్
www.aksharadarbar.com
Voice of the people
సోమవారం 02, ఫిబ్రవరి 2026

# ఎన్నికల వేళ 'మత్తు' చిందులు..!

- ఓటర్లను ఆకట్టుకునేందుకు 'మందు' పార్టీలు..
- యువత భవిష్యత్తుపై ఆందోళన

03



# ఉత్కంఠ

## ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ

- అభ్యర్థుల ఎంపికలో సరికొత్త పోకడ
- అభ్యర్థిత్వం ఆశిస్తున్న నేతల నుంచి డిపాజిట్ల సేకరణ
- ఆర్థిక బలమే అభ్యర్థిత్వానికి కొలమానం
- ప్రతి మున్సిపాలిటీలో ఇప్పటికీ పూర్తికాని అభ్యర్థిత్వాల ఖరారు
- రేపటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు.. 'బీ-ఫామ్' ఎవరికో?

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎన్నికల రాజకీయం క్లైమాక్స్‌కు చేరుకుంది. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం ఆఖరి గడువు కావడంతో, ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత ఉత్కంఠగా మారింది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలలో టికెట్ల కోసం సాగుతున్న పోటీ నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది.

– అక్షరదర్బార్, వరంగల్




02



# తక్షణ చర్యలు తీసుకోవాలి

- ప్రజావాణి వినతుల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

02

# డ్యూటీకి తాళం

02

- జాతరకు 'జైకొట్టిన' సిబ్బంది!




- వరంగల్ హోమియో ఆసుపత్రిలో బాగోతం
- డైరెక్టర్ సీజ్ చేస్తే.. దొంగచాటుగా తెరిచిన వైనం!

04

# వసూళ్లపై దృష్టి సారించండి




- ప్రతి రోజు రూ.50 లక్షల పన్ను వసూళ్లు చేపట్టాలి
- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

02

# సర్వేలే 'సర్వస్వం'..

## అభ్యర్థుల ఎంపికలో అవే ప్రమాణం!

04

# ఉత్కంఠ

**ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ**




- **అభ్యర్థుల ఎంపికలో సరికొత్త పోకడ**
- **అభ్యర్థిత్వం ఆశిస్తున్న నేతల నుంచి డిపాజిట్ల సేకరణ**
- **ఆర్థిక బలమే అభ్యర్థిత్వానికి కొలమానం**
- **ప్రతి మున్సిపాలిటీలో ఇప్పటికీ పూర్తికాని అభ్యర్థిత్వాల ఖరారు**
- **రేపటితో ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు.. 'బీ-ఫామ్' ఎవరికో?**

అక్షరదర్బార్, వరంగల్ : ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎన్నికల రాజకీయం క్లైమాక్స్‌కు చేరుకుంది. నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం ఆఖరి గడువు కావడంతో, ప్రధాన రాజకీయ పార్టీల్లో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ అత్యంత ఉత్కంఠగా మారింది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలలో టికెట్ల కోసం సాగుతున్న పోటీ నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది.

**- టికెట్ కోసం 'డిపాజిట్' అస్త్రం!**

ఈసారి ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలో సరికొత్త పోకడలు కనిపిస్తున్నాయి. అభ్యర్థిత్వం ఆశిస్తున్న నేతల నుంచి పార్టీలు భారీగా డిపాజిట్లు సేకరిస్తున్నట్లు సమాచారం. చిన్న మున్సిపాలిటీల్లో వార్డుకు రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు, పెద్ద మున్సిపాలిటీల్లో రూ. 30 లక్షల వరకు స్థానిక నాయకత్వం వసూలు చేసినట్లు సమాచారం. టికెట్ దక్కని వారు 'రెబల్'గా మారకుండా అడ్డుకోవడమే ఈ వ్యూహం వెనుక ఉన్న ఉద్దేశం. టికెట్ రాని వారికి ఎన్నికల తర్వాత ఈ మొత్తాన్ని వాపసు ఇస్తామని, అధికారిక అభ్యర్థికి సహకరించాలని పార్టీలు షరతులు విధిస్తున్నాయి.

**- బలమే అర్హత.. సర్వేలే ప్రామాణికం**

గతంలో పార్టీ విధేయతకు ప్రాధాన్యత ఇచ్చేవారు. కానీ, ప్రస్తుతం ప్రజల్లో ఉన్న పలుకుబడితో పాటు 'ఆర్థిక బలం' కలిగి ఉండటమే అభ్యర్థిత్వానికి కొలమానంగా మారుతోంది. సర్వే రిపోర్టుల ఆధారంగానే టికెట్లు ఇస్తామని అధిష్టానం చెబుతుండటంతో ఆశావహులు తమ పలుకుబడిని నిరూపించుకునే ప్రయత్నాల్లో ఉన్నారు.

**- రేపు మధ్యాహ్నమే తుది చిత్రం**

మెజారిటీ వార్డుల్లో ఇద్దరు నుంచి నలుగురు అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ఎవరికి 'బీ-ఫామ్' దక్కుతుందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. పోటీ తక్కువగా ఉన్న చోట ఇప్పటికే క్లారిటీ రాగా, పోటీ తీవ్రంగా ఉన్న వార్డుల్లో మంగళవారం ఉదయం బీ-ఫామ్‌లు అందజేస్తామని పార్టీలు చెబుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాతే బరిలో ఉండే అసలు అభ్యర్థులెవరో తేలనుంది. స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీల వద్ద ఈ డిపాజిట్లు పెట్టినట్లు తెలుస్తుండటంతో రాజకీయ వర్గాల్లో ఇది చర్చనీయాంశంగా మారింది. మునుపెన్నడూ లేని రీతిలో మున్సిపల్ ఎన్నికల్లో డబ్బు, రెబల్స్ బెడద ప్రధాన పాత్ర పోషిస్తుండటంతో ఓటర్లలోనూ ఆసక్తి నెలకొంది.

# మార్గదర్శకాలను పాటించాలి

- **చైర్మన్, వైస్ చైర్మన్ ల ఎంపికకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**
- **రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని**
- **జిల్లా ఎన్నికల అధికారులతో వీసీ ద్వారా సమీక్ష**

అక్షరదర్బార్, హనుమకొండ: మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎంపికలో ఎక్స్ ఆఫీషియో సభ్యులు ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, ఎక్కడా చిన్నపాటి లోపాలకు కూడా అవకాశం ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు భంగం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పూర్తిగా అమలులో ఉండాలని, నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎంపిక ప్రక్రియలో భాగంగా కౌన్సిలర్లకు, ఎక్స్ ఆఫీషియో సభ్యులకు ముందుగానే సమాచారం అందించాలని, పోలింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన వరకు ప్రతి దశను సక్రమంగా పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హనుమకొండ కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్ పాల్గొన్నారు.

# డ్యూటీకి 'తాళం'

- **జాతరకు 'జైకొట్టిన' సిబ్బంది!**
- **వరంగల్ హోమియో ఆసుపత్రిలో బాగోతం**
- **డైరెక్టర్ సీజ్ చేస్తే.. దొంగచాటుగా తెరిచిన వైనం!**

అక్షరదర్బార్, వరంగల్ : వైద్యో నారాయణో హరిః.. అన్న సూక్తిని వరంగల్ ఎంజీఎం ప్రాంగణంలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రి సిబ్బంది అక్షరాలా తుంగలో తొక్కారు. రోగుల ప్రాణాల కంటే మేడారం మొక్కులే ముఖ్యమనుకున్నారో ఏమో కానీ, ఆసుపత్రికి తాళం వేసి మరీ జాతర బాట పట్టారు. ఈ నిర్లక్ష్య పర్వంపై ఆయుష్ డైరెక్టర్ కొరడా ఝులిపించినా.. సిబ్బంది తీరు మాత్రం 'మా ఇష్టం' అన్నట్లుగా సాగడం గమనార్హం.

- **నిర్లక్ష్యానికి 'సీజ్' షాక్!**

ప్రస్తుతం మేడారం జాతర సందడి నెలకొన్న వేళ, బాధ్యత గల ప్రభుత్వ హోమియో ఆసుపత్రి సిబ్బంది సామూహికంగా విధులకు ఎగనామం పెట్టారు. సోమవారం ఆకస్మిక తనిఖీకి వచ్చిన ఆయుష్ డైరెక్టర్లకు ఆసుపత్రి గేటుకు వేలాడుతున్న తాళం చూసి మతిపోయింది. పనివేళల్లో ఆసుపత్రి మూసి ఉండటాన్ని తీవ్రంగా పరిగణించిన డైరెక్టర్, అక్కడికక్కడే ఆసుపత్రిని సీజ్ చేసి నివేదిక కోరారు.




- **సీజ్ చేసిన తాళం.. చిటికెలో ఎలా తెరుచుకుంది?**

ఈ వ్యవహారంలో అసలు డ్రామా సోమవారం ఉదయం మొదలైంది. ఉన్నతాధికారి స్వయంగా సీజ్ చేసిన తాళాన్ని, సిబ్బంది ఏ అధికారంతో తెరిచారన్నది ఇప్పుడు మిస్టరీగా మారింది. డైరెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ, సీజ్ చేసిన ఆసుపత్రిని సిబ్బంది యథేచ్ఛగా తెరిచి విధుల్లో చేరడంపై ఎంజీఎం పరిరక్షణ కమిటీ మండిపడుతోంది. "చట్టబద్ధంగా వేసిన తాళాన్ని తీసే హక్కు వీరికి ఎవరిచ్చారు? ఇదంతా ఉన్నతాధికారుల కళ్లుగప్పి చేస్తున్న మాయాజాలమేనా?" అని కమిటీ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

## బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్**

అక్షరదర్బార్, హనుమకొండ: బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. పోలీస్ కమిషనరేట్‌లో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ సబ్ ఇన్ స్పెక్టర్లుగా విధులు నిర్వహిస్తూ సివిల్ ఎస్సెలుగా పదోన్నతి పొందిన వేణుగోపాల్ రెడ్డి, రాజేందర్, పర్వీన్ లు సోమవారం సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. అప్పగించిన పనులను సమర్థవంతంగా పనిచేస్తూ బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.



# వసూళ్లపై దృష్టి సారించండి

- **ప్రతి రోజు రూ.50 లక్షల పన్ను వసూళ్లు చేపట్టాలి**
- **బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్**

అక్షరదర్బార్, వరంగల్: నగర పరిధిలోని పన్ను బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలని బల్దియా కమిషనర్ చాహాత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమ అనంతరం వివిధ విభాగాల అధికారుల తో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఉన్నతాధికారులు బిల్డ్ నౌలో చైన్ మెన్లతో పాటు నూతనంగా బాధ్యతలు చేపట్టిన బిల్డింగ్ ఇన్ స్పెక్టర్ లకు శిక్షణ ఇవ్వాలని, ఇంజనీరింగ్ అధికారులు గ్రీవెన్స్ లో వచ్చిన నల్లాలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వీధి దీపాలకు సంబంధించిన సమస్యలను వారంలోగా క్లియర్ చేయాలని, నల్లా పన్నుల పెండింగ్ బిల్లులు వసూలు చేసే క్రమంలో భాగంగా ఫోన్ ద్వారా సమాచారం అందజేసి చెల్లించేలా ప్రోత్సహించాలని, రెవిన్యూ సిబ్బంది ప్రతి రోజు కనీసం రూ.50 లక్షలు వసూళ్లు చేపట్టాలని, శని, ఆది వారాల్లో కూడా క్షేత్ర స్థాయిలో పన్నులను సేకరించాలన్నారు. రాబోవు రెండు మాసాలు సెలవులు లేకుండా వసూళ్లపై దృష్టి కేంద్రీకరించాలని అన్నారు. నగర పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు చెల్లించాల్సిన పన్ను బకాయిలను వసూలు చేసేలా డిప్యూటీ కమిషనర్ లు ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందు కోసం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు సమాచారం అందజేసి పన్ను వసూళ్లు చేయాలని, నగరంలో ఉన్న సెల్ టవర్ ల బకాయిలు రూ.6 కోట్ల50 లక్షల వరకు పెండింగ్ లో ఉన్నాయని, ఈ వసూళ్లను సంబంధిత ఏజెన్సీలనుండి వసూలు చేయాలని, రాబోవు 2 నెలల పన్ను వసూళ్లను చేపట్టడానికి వీలుగా ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసి వసూళ్లు చేపట్టేలా చూడాలని తెలిపారు.

ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల తీరు ఆశాజనకంగా లేదని, ఈ వసూళ్లపై దృష్టి సారించాలని, 25% పెనాల్టీ మాఫీ ప్రక్రియను వేగవంతంగా చేపట్టి వాటి బకాయిలు చెల్లించేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ ఇంచార్జి ఎస్ఈ శ్రీనివాస్ రావు, సీఎంహెచ్ఓ డా రాజారెడ్డి, డీఎఫ్ ఓ శంకర్ లింగం, సీహెచ్ ఓ రమేష్, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్నరాణి, సమ్మయ్య, టీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ 'మత్తు' చిందులు..!

- ఓటర్లను ఆకట్టుకునేందుకు 'మందు' పార్టీలు..
- యువత భవిష్యత్తుపై ఆందోళన



అక్షరదర్బార్, పరకాల : పరకాల మున్సిపాలిటీలో ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఫిబ్రవరి 11న జరగనున్న పోలింగ్ కోసం ప్రధాన పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఖరారు చేయడంతో, వార్డుల్లో ప్రచార పర్వం ఊపందుకుంది. అయితే, ప్రజాస్వామ్య పండుగలా సాగాల్సిన ఈ ప్రచారం, కొన్నిచోట్ల 'మత్తు' దృశ్యాలతో మసకబారుతోంది. ప్రచారానికి అనుబంధంగా 'మందు' విందులు జరుగుతున్నాయి. వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఆశావహులు, ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రధానంగా యువత, పురుష ఓటర్లను లక్ష్యంగా చేసుకుని నిత్యం 'మందు పార్టీలు' ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. సోమవారం పట్టణంలోని ఒక ప్రధాన కూడలిలో ఓ వ్యక్తి పగలే మత్తులో తూలుతూ కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో కూడా వైరల్ అవుతుండటంతో చర్చ ఊపందుకుంది.

**స్థానికుల ఆందోళన.. అధికారుల నిశ్శబ్దం?**

ఎన్నికల వేళ రాజకీయ నాయకులు పంచే మద్యం వల్ల యువత తాగుడుకు బానిసలయ్యే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "ఓటు కోసం మత్తును ఎరగా వేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే" అని స్థానికులు విమర్శిస్తున్నారు. "ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ వెంటనే స్పందించి, బెల్ట్ షాపులపై, అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపాలి. ప్రచార సమయాల్లో నిఘా పెంచి, నిబంధనలు ఉల్లంఘించే అభ్యర్థులపై కఠిన చర్యలు తీసుకోవాలని" స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ఫిర్యాదు చేయవచ్చు..**

ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున, ఎక్కడైనా మద్యం పంపిణీ లేదా నగదు పంపిణీ జరుగుతున్నట్లు గమనిస్తే ప్రజలు వెంటనే ఈ క్రింది మార్గాల్లో ఫిర్యాదు చేయవచ్చు. CVIGIL యాప్ లో ఫోటో లేదా వీడియో అప్‌లోడ్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. జిల్లా ఎన్నికల అధికారుల ఫిర్యాదుల విభాగానికి సమాచారం అందించవచ్చు. పోలీస్ కంట్రోల్ రూమ్ 100 కి సమాచారం ఇవ్వడం ద్వారా తక్షణ తనిఖీలు చేయించవచ్చు.

# నాగుర్ల వెంకన్నకు ఆరె కుల సంఘం నాయకుల శుభాకాంక్షలు

- రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవ ఎన్నికపై హర్షం

అక్షరదర్బార్, పరకాల: తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ & సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగుర్ల వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా సోమవారం హనుమకొండలోని ఆయన నివాసంలో ఆరె కుల సంఘం నాయకులు లాడే శివ, మోటె చిరంజీవి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాగుర్ల వెంకన్న రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నిక కావడం రైతులకు, డీలర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆయన నాయకత్వంలో సంఘం మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. నాగుర్ల వెంకన్నకు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో పలువురు సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# 14వ వార్డులో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

- ప్రజల మద్దతుతో ముందుకు సాగుతున్న కొక్కిరాల దీప్తి రాకేష్ రావు

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణం 14వ వార్డులో బీఆర్ఎస్ ప్రచారం ఉత్సాహంగా సాగుతోంది. నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, వార్డు సమస్యలపై నేరుగా స్పందిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి కొక్కిరాల దీప్తి రాకేష్ రావుకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. సోమవారం పరకాల పట్టణంలోని వెలమవాడ ప్రాంతంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారం సందర్భంగా స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థికి ఆత్మీయ స్వాగతం పలికారు. "బిడ్డా... మా ఓటు నీకే" అంటూ ప్రజలు నినాదాలు చేస్తూ ప్రచారానికి ఉత్సాహం నింపారు.

ఈ సందర్భంగా కొక్కిరాల దీప్తి రాకేష్ రావు మాట్లాడుతూ, కాలనీలోని తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలన్నింటినీ పరిష్కరించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆశీస్సులతో, ప్రజల ఆశీర్వాదం కోరుకుంటూ మీ ముందుకు వచ్చానని తెలిపారు. మీరు ఆశీర్వదిస్తే 14వ వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ధీమా వ్యక్తం చేశారు. 14వ వార్డులో బీఆర్ఎస్ ప్రచారం రోజురోజుకీ మరింత ఊపందుకుంటోందని, ప్రజల మద్దతు స్పష్టంగా కనిపిస్తోందని పరకాల పట్టణంలో పలువురు పేర్కొంటున్నారు.



# వార్డు ప్రజలకు అండగా గంట కళావతి

12వ వార్డులో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 12వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి గంట కళావతి విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. సోమవారం ఆమె ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకుంటూ తమకే ఓటు వేసి ఆశీర్వదించాలని కోరారు. ప్రచారంలో భాగంగా వార్డులో అనారోగ్యంతో ఉన్న కుటుంబాన్ని పరామర్శించిన ఆమె, ఎప్పుడూ వార్డు ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గంట కళావతి చేపడుతున్న ప్రచారానికి వార్డు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. "మీకు మా పూర్తి సహకారం ఉంటుంది.. గెలుపు మీదే" అంటూ ఓటర్లు హామీ ఇస్తున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ గెలుపు ఖాయమని వార్డు ప్రజలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# ఫర్టిలైజర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగుర్ల

- రైతులు–డీలర్ల సంక్షేమమే లక్ష్యం
- రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు



అక్షర దర్బార్, హనుమకొండ: తెలంగాణ ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగుర్ల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రామడుగు మనోహర్, కోశాధికారిగా సిద్ది నాగరాజును రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసింది. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశం అసోసియేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షులు నీలగిరి హనుమంతరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త రాష్ట్ర కార్యవర్గాన్ని డీలర్స్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు సహా కార్యవర్గానికి డీలర్స్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

**రైతులు–డీలర్ల సంక్షేమమే లక్ష్యం**

ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు, డీలర్ల సంక్షేమం మరియు అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులకు సకాలంలో నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందేలా కృషి చేస్తామని చెప్పారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న డీలర్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ అసోసియేషన్ నుంచి రవీందర్ రెడ్డి, మల్లేశం, జలంధర్, వరంగల్ నుంచి సత్యనారాయణ రెడ్డి, కేదారి, నాగరాజు, రాజేందర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, ఖమ్మం నుంచి రాంబ్రహ్మం, నాగేశ్వరరావు, నాగేందర్, హైదరాబాద్ నుంచి మునాఫ్‌తో పాటు వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో డీలర్స్ పాల్గొన్నారు.

# కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు: నర్సంపేట సీఐ



అక్షర దర్బార్, నర్సంపేట : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని నర్సంపేట టౌన్ సీఐ ముష్క శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రచారంలో ఇతర పార్టీలను లేదా వ్యక్తులను కించపరిచేలా వ్యాఖ్యలు చేయకూడదని సూచించారు. ఓట్ల కోసం డబ్బు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. బెల్ట్ షాపులు నిర్వహించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# 10వ వార్డులో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

**పసుల లావణ్య రమేశ్ గెలుపే లక్ష్యంగా విస్తృత ప్రచారం**

అక్షర దర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 10వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి పసుల లావణ్య రమేశ్ గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ సందర్భంగా వార్డు ఇంచార్జి బట్టమేకల భరత్ యాదవ్ , వార్డు అధ్యక్షులు పెండ్యాల ప్రతాప్ ఆధ్వర్యంలో మాదారం కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని స్థానిక ప్రజలను కలిసి అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని కోరారు. గతంలో చేసిన అభివృద్ధి పనులు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించి, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించినట్లు నాయకులు తెలిపారు.



# 15వ వార్డులో బీజేపీ ప్రచారం

**స్వాగతం పలుకుతున్న వార్డు ప్రజలు**

అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఉధృతంగా కొనసాగుతోంది. సోమవారం 15వ వార్డులో బీజేపీ ప్రచారం జోరుగా సాగింది. బీజేపీ 15వ వార్డు అభ్యర్థి కుక్కల విజయ్ కుమార్ పార్టీ నాయకులతో కలిసి కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో ప్రచారంలో పాల్గొని మహిళలకు బొట్టు పెడుతూ బిజెపి అభ్యర్థికి తమ మద్దతు తెలిపారు. అభ్యర్థి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ, బీజేపీ హయాంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. వార్డులో బీజేపీకి పెరుగుతున్న ఆదరణ స్పష్టంగా కనిపిస్తోందని, ఈ ఎన్నికల్లో 15వ వార్డులో గెలుపు బీజేపీదేనని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.



# సర్వేలే 'సర్వస్వం'..

## అభ్యర్థుల ఎంపికలో అవే ప్రమాణం!

- మున్సిపల్ పోరులో పార్టీల వింత పోకడ
- క్షేత్రస్థాయిలో పరిస్థితి వేరు.. రిపోర్టులు వేరు
- సర్వే మాయలో పడితే 'కొంప' మునగడం ఖాయమా?



అక్షర దర్బార్, కేసముద్రం: రాజకీయ పార్టీలను ఇప్పుడు 'సర్వే'ల జ్వరం పట్టుకుంది. నిన్నటి వరకు సర్పంచ్ ఎన్నికల్లో తలమునకలైన పార్టీలు, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల వేళ సర్వేలనే నమ్ముకుంటున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి గెలుపోటముల అంచనాల వరకు అంతా సర్వే సంస్థల నివేదికల ఆధారంగానే సాగుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో ప్రజల నాడి ఒకలా ఉంటే, సర్వే రిపోర్టులు మరోలా ఉండటం ఇప్పుడు అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. మున్సిపాలిటీల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు సర్వేల మాయాజాలాన్ని తప్పుబడుతున్నారు.

పుట్టగొడుగుల్లా సర్వే సంస్థలు

ఒకప్పుడు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే సర్వే సంస్థలు, ఇప్పుడు గల్లీ ఎన్నికలకు కూడా పరిపాటిగా మారాయి. ప్రస్తుతం కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, మరిపెడ, తొర్రూరు వంటి మున్సిపాలిటీల్లో ఎన్నికల వేడి కనిపిస్తోంది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు తమ అభ్యర్థుల ఎంపిక కోసం ప్రైవేట్ ఏజెన్సీలతో సర్వేలు చేయించుకున్నాయి. ఒకే నియోజకవర్గంలో మూడు, నాలుగు సార్లు సర్వేలు చేయించి అభ్యర్థులను వడపోశారు. కానీ, ఈ రిపోర్టుల కొలమానం ఏంటన్నదే ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

**నమ్మశక్యం కాని కొలమానం!**

ఒక వార్డులో సగటున 2,000 మంది ఓటర్లు ఉంటే, కేవలం 50 నుండి 100 మంది అభిప్రాయాలను తీసుకుని సదరు సంస్థలు నివేదికలు సిద్ధం చేస్తున్నాయి. ఈ స్వల్ప సంఖ్యలో తీసుకున్న శాంపిల్స్ ఆధారంగా అభ్యర్థి గెలుపు గుర్రామా? కాదా? అని తేల్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వే సంస్థలు డబ్బులిచ్చిన పార్టీలకు అనుకూలంగా రిపోర్టులు ఇస్తున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. నెగటివ్ రిపోర్ట్ ఇస్తే ఎక్కడ కాంట్రాక్టులు పోతాయో అన్న భయంతో సర్వే సంస్థలు నాయకులను ఖుషీ చేసే రిపోర్టులే ఇస్తున్నట్లు చర్చ జరుగుతోంది.

**బీ-ఫామ్ టెన్షన్..**
**పక్కన పెట్టిన పాత కాపులు**

సర్వే రిపోర్టుల పుణ్యమా అని ఏళ్ల తరబడి పార్టీని నమ్ముకున్న నేతలను పక్కన పెట్టి, సర్వేలో 'హై స్కోర్' వచ్చిందన్న కారణంతో కొత్తవారికి, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో కేసముద్రం వంటి చోట్ల అభ్యర్థుల ఎంపికపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. నామినేషన్ల గడువు సమీపిస్తున్నా బీ-ఫామ్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టడం అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

**ప్రజల నాడి పట్టుకుంటాయా?**

గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పేరున్న సంస్థల అంచనాలే తారుమారయ్యాయి. క్షేత్రస్థాయిలో ప్రజలు సైలెంట్‌గా ఉండి పోలింగ్ రోజున తమ ప్రతాపం చూపుతున్నారు. సర్వే రిపోర్టులను నమ్ముకుని టికెట్లు ఇచ్చిన పార్టీలకు, ఫలితాలు వచ్చాక 'కొంప' మునిగే ప్రమాదం ఉందని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. సర్వేలు 'దైవాధీనం'.. గెలుపోటములు 'ప్రజాధీనం' అన్నట్లుగా మున్సిపల్ ఎన్నికల ముఖచిత్రం మారింది.

# ములుగు లయన్స్ క్లబ్‌కు 12 అవార్డుల పంట




అక్షర దర్బార్, ములుగు: లయన్స్ ఇంటర్నేషనల్ 320ఎఫ్ రీజినల్ మహాసభల్లో ములుగు లయన్స్ క్లబ్ సత్తా చాటింది. మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి చేతుల మీదుగా క్లబ్ ప్రతినిధులు మొత్తం 12 అవార్డులను అందుకున్నారు. దొంతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి (బెస్ట్ ప్రెసిడెంట్), చుంచు రమేష్ (బెస్ట్ సెక్రటరీ), ఆడెపు రాజు (బెస్ట్ ట్రెజరర్) పురస్కారాలు పొందారు. సేవా కార్యక్రమాల్లో ముందున్నందుకు గాను సభ్యులను అతిథులు అభినందించారు.

# కేంద్ర బడ్జెట్ ప్రతుల దగ్ధం

అక్షర దర్బార్, వరంగల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ విమర్శించారు. సోమవారం వరంగల్ చౌరస్తాలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చేలా బడ్జెట్‌ను రూపొందించిందని, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను విస్మరించిందని మండిపడ్డారు. ఉపాధి హామీ నిధులు పెంచాలని డిమాండ్ చేశారు.

# 15వ వార్డు బీఆర్ఎస్ అడ్డా

**జోరుగా సాగుతున్న వేణుగోపాల మూర్తి ప్రచారం**



అక్షరదర్బార్, పరకాల: పరకాల పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో 15వ వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి కందుకూరి వేణుగోపాల మూర్తి ప్రచారం జోరుగా కొనసాగుతోంది. సోమవారం ఆయన వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రజలతో నేరుగా మమేకమై ఆశీర్వాదాలు కోరారు.
ఈ సందర్భంగా వేణుగోపాల మూర్తి మాట్లాడుతూ, "15వ వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే నా లక్ష్యం. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారం చూపిస్తాను" అని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, పట్టణ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, స్వర్ణకార సంఘ జిల్లా, పరకాల పట్టణ, మండల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని, కందుకూరి వేణుగోపాల మూర్తికి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.అలాగే పరకాల మాజీ ఎంపీటీసీ చందుపట్ల సాయి తిరుపతి రెడ్డి, హనుమకొండ జిల్లా స్వర్ణకార సంఘ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు, స్వర్ణకార సంఘ నాయకులు తదితరులు పాల్గొని ప్రచారాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. 15వ వార్డులో బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో అపూర్వ స్పందన కనిపిస్తోందని, గెలుపు ఖాయమనే నమ్మకంతో కార్యకర్తలు ప్రచారంలో పాల్గొంటున్నారు.

# 21వ వార్డులో కాంగ్రెస్ ఇంటింటా ప్రచారం

అక్షరదర్బార్, పరకాల: పరకాల మున్సిపాలిటీ 21వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేసింది. పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదమల్ల రమేష్ గెలుపును లక్ష్యంగా చేసుకుని పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. స్థానిక సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎర్రబెల్లి భాస్కర్ రెడ్డి, ఎండి జాఫర్ రిజ్వి, వార్డు అధ్యక్షులు సుదమల్ల రమేష్, దేవు రమేష్, జీడిమెట్ల మహేందర్, రాములు, న్యాతాని భాస్కర్, సుదమల్ల కిషోర్, చైతన్య, పృధ్వి తదితరులు పాల్గొన్నారు.






# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

**డిజిటల్ విప్లవంలో భాగంకండి!**

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.

వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

**మీ నమ్మకమే మా బలం!**

Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI N0.TELTEL/2022/81915